క్లుప్తంగా

'మనబడి' పనులు త్వరగా పూర్తిచేయాలి

ఎంపీడీఓ శైలజారెడ్డి



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శైలజారెడ్డి తదితరులు

మోమిన్‌పేట: మనఊరు మనబడి పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ శైలజారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించి మాట్లాడారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా సెలవులు ఉన్నప్పుడే పూర్తి చేయాలని సర్పంచ్ అంగేరి శ్రీనివాస్‌రెడ్డికి సూచించారు. గదుల మరమ్మతులు, పెయింటింగ్ తదితర పనులు పూర్తి చేయాలని చెప్పగా.. సర్పంచ్ మాట్లాడుతూ పనులు చివరి దశకు చేరాయని పేర్కొన్నారు. ఎంపీడీఓ వెంట ఎంపీఓ యాదగిరి, కార్యదర్శి నర్సింహులు, ప్రధానోపాధ్యాయుడు రాములు తదితరులు ఉన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం



క్రేన్ సహాయంతో ప్రతిష్ఠింపజేస్తున్న ధ్వజస్తంభం

కుల్కచర్ల: ఇప్పాయిపల్లిలో రెండురోజులుగా ఆంజనేయస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతోంది. వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకలో భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.

ఉత్తమ విద్యార్థికి సన్మానం



బసవేశ్వరుడి చిత్రపటంతో సన్మాన గ్రహీత గాయత్రి

బంట్వారం: ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి వీరశైవ సమాజం యువదళ్ ఆధ్వర్యంలో గురువారం కోట్‌పల్లి మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. కోట్‌పల్లికి చెందిన పత్తి గాయత్రి నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ (ఎంపీసీ) చదువుతోంది. ఇటీవల విడుదలైన ఫలితాల్లో గాయత్రి 465 మార్కులు సాధించి ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా యువదళ్ ప్రతినిధులు సత్కరించి బసవేశ్వరుడి చిత్రపటాన్ని బహుకరించారు. కార్యక్రమంలో సమాజం మండల అధ్యక్షుడు శివప్రసాద్, ప్రతినిధులు గౌరిశంకర్, భద్రేశ్వర్, అమర్‌నాథ్, నిఖిల్, వైద్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.1.11లక్షల విరాళం



మర్పల్లి: విరాళం అందజేస్తున్న జెడ్పీటీసీ మధుకర్

మర్పల్లి: సిరిపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయానికి జెడ్పీటీసీ పట్నే మధుకర్ ఆలయ కమిటీ సభ్యులకు రూ.1లక్ష 11వేల 116 విరాళంగా అందజేశారు. అనంతరం మధుకర్ మాట్లాడారు. పార్టీలకతీతంగా దైవ కార్యక్రమాలకు తమకు తోచిన విధంగా సహాయపడాలని చెప్పారు. ఎంపీపీ లలిత, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ యాదయ్య పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

బొంరాస్‌పేట: అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి ఎస్ఆర్ఐ ఆలమయ్యనాయుడు గురువారం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలమయ్య మాట్లాడుతూ ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలకు ఆర్థికసాయం చేయడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఈ సందర్భంగా ఆలయకమిటీ సభ్యులు దాతను అభినందించారు.

దశలవారీగా గ్రామాభివృద్ధి

పెద్దేముల్: గ్రామాన్ని దశల వారీగా అభివృద్ధి చేస్తానని సర్పంచ్ మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం కందనెల్లి గ్రామం 9వ వార్డు ఎస్సీకాలనీలో జీపీ నిధులతో తాగునీటి బోరును వేయించి మాట్లాడారు. ప్రస్తుతం మిషన్ భగీరథ నీరు రాక, చేతి పంపులు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, అందుకే బోరే వేయించి నీటి ఇబ్బందులు తొలగిస్తున్నానని చెప్పారు.

ఇష్టారాజ్యంగా తోడేస్తున్నారు!

అనుమతుల్లేవ్.. ఆపేటోళ్లూ లేరు!

- చోద్యం చూస్తున్న అధికారులు
- యథేచ్ఛగా మట్టి రవాణా
- ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో తవ్వకాలు



ఖమ్మం నాచారం ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు

దోమ: మట్టి దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు అక్రమార్కులు ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో ఇష్టారాజ్యంగా మట్టిని తోడేస్తున్నారు. వెంచర్లు, గృహ నిర్మాణాలు, రైస్ మిల్లులకు తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. రూ. లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండీ కొడుతున్నారు. ఇలా బహిరంగంగా మాఫియా ఆగడాలు శృతిమించిపోతున్నప్పటికీ.. మైనింగ్ అధికారులు పట్టించుకోకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండతో దందా జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండల పరిధి ఖమ్మం నాచారం గ్రామం సర్వే నంబర్ 77 ప్రభుత్వ భూమిలో ఆరు రోజులుగా కొందరు ఎక్స్‌కవేటర్లతో మట్టిని తోడుతూ ట్రాక్టర్లలో ఓ రైస్ మిల్‌కు తరలిస్తున్నారు. ఊటుపల్లి, రాకొండ గ్రామాల్లోనూ రెండు నెలలుగా ఓ వ్యాపారి టిప్పర్లతో రాత్రి వేళల్లో మట్టిని దోచేస్తున్నాడు. విషయం తెలిసినా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా గ్రామాల్లో గృహ అవసరాలకు, నిర్మాణాలకు, రోడ్డు పనులకు మొరం అవసరం ఉండి మట్టి కావాలంటే అనుమతులు తప్పనిసరంటూ చెప్పే అధికారులు.. ఇలా ఇష్టానుసారంగా మట్టిని దోచేస్తున్న వారిపై ఎందుకు చర్యలు చేపట్టడం లేదంటూ పలువురు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి దందాను అరికట్టాలని కోరుతున్నారు.

మా దృష్టికి రాలేదు



మట్టి తరలిస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. ఒక వేళ తరలిస్తున్నట్లు తెలిస్తే వాహనాలు సీజ్ చేస్తాం. సంబంధిత వ్యక్తులపై తగిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో మట్టిని తరలించాలంటే తప్పనిసరిగా మైనింగ్ ఏడీ అనుమతులు తీసుకోవాలి. పర్మిషన్ లేకుండా మట్టి రవాణా చేస్తే చర్యలు తప్పవు.

– షాహెదాబేగం, తహసీల్దార్, దోమ

వృత్తిపై శ్రద్ధ చూపని ఉపాధ్యాయులు

- వారి వైఫల్యంతోనే గతి తప్పిన 'పది' ఫలితాలు
- వైఎస్ఆర్‌టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ కోళ్ల యాదయ్య



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పరిగి: ఉపాధ్యాయులు తమ వృత్తిపై శ్రద్ధ చూపకపోవడంతోనే పది తరగతి ఫలితాలు గతి తప్పాయని వైఎస్ఆర్‌టీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ కోళ్ల యాదయ్య, సీపీఐ ఎంఎల్ డివిజన్ కార్యదర్శి మల్లేశ్ ఆరోపించారు. ఎక్కువ శాతం విద్యార్థులు ఫెయిల్ కావడంపై విద్యాశాఖ, ఉపాధ్యాయులు బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లా.. రాష్ట్రంలో అట్టడుగు స్థానంలో ఉండటం సిగ్గు చేటన్నారు. ఇదివరకు ఎన్నడూ ఇలా జరగలేదని, ప్రస్తుత ఫలితాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎంతో చేస్తుందని చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో అది కనబడటం లేదని విమర్శించారు. గ్రామాల్లో పాఠశాలలకు ఉపాధ్యాయులు సక్రమంగా రావడం లేదని ప్రజలు ఫిర్యాదు చేస్తే.. రాజకీయం చేస్తూ తప్పించుకుంటున్నారని మండిపడ్డారు. వచ్చిన ఫలితాలపై ఉన్నత అధికారులు లోతుగా పరిశీలించి బాధ్యతారహితంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సప్లిమెంటరీ పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ చూపి, ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి, వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జాకప్, యాదయ్య, బసిరెడ్డి, బాల్‌రెడ్డి, రాజు, లక్ష్మణ్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

19 మందిలో.. ఒకే ఒక్కడు

43 సంవత్సరాలకు పునరావృతం



మోమిన్‌పేట బాలుర ఉన్నత పాఠశాల

మోమిన్‌పేట: మోమిన్‌పేట బాలుర ఉన్నత పాఠశాలలో 19 మంది పదో తరగతి పరీక్ష రాయగా.. ఒకే ఒక్కడు జ్ఞానేశ్వర్ చారి (7.2) ఉత్తీర్ణత సాధించాడు. 43 సంవత్సరాల క్రితం మోమిన్‌పేట, బంటార్వం, మర్పల్లి, కోటపల్లి, పట్లూరు, సిరిపురం ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులకు కేవలం మోమిన్‌పేట బాలుర ఉన్నత పాఠశాలలోనే పరీక్ష కేంద్రం ఉండేది. అప్పుడు ఒకే ఒక్కడు మానయ్య అనే విద్యార్థి ఉత్తీర్ణత సాధించగా.. ఇప్పుడు పునరావృతం కావడం చర్చనీయంశంగా మారింది. అదే విధంగా ఎన్కతలలో 10మంది, మోమిన్‌పేట ఉర్దు మీడియం ఉన్నత పాఠశాలలో 7మంది బాలురు పరీక్ష రాయగా ఒక్కరు కూడా ఉత్తీర్ణత సాధించలేకపోయారు. తప్పు ఉపాధ్యాయులు, విద్యార్థులదో తెలియదు కానీ.. రిజల్ట్ మాత్రం పూర్తిగా పడిపోయింది. ఒకప్పుడు పాస్ అయితే చాలన్న విద్యార్థులు.. ప్రస్తుతం 80శాతం పైబడి మార్కులు సాధించడానికి పోటీ పడుతున్న తరుణంలో ఫలితాలు ఇలా ఉండటమేంటని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఏది ఏమైనా ఫలితాలు సాధించడంలో ప్రభుత్వ పాఠశాలలు వెనుకబడిపోయాయనడంలో సందేహం లేదని పలువురు అభిప్రాయపడ్డారు.

కార్మికుల కోసమే వైద్యశిబిరం

ప్రతి ఒక్కరూ లేబర్ కార్డు పొందండి: సర్పంచ్



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ పద్మమ్మ

పరిగి: కార్మికుల కోసం నిర్వహించే హెల్త్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పద్మమ్మ సూచించారు. గురువారం నస్కల్ గ్రామంలో కార్మికశాఖ సహకారంతో జన్‌సాహస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించి మాట్లాడారు. లేబర్ కార్డు కలిగిన ప్రతి కార్మికుడికి 50రకాల వైద్య పరీక్షలు చేసి, అనారోగ్య సమస్యలు ఉన్న వారికి మందులు అందజేస్తారని తెలిపారు. కార్మికులు వివిధ పనులు చేసి అనారోగ్యానికి గురవుతుంటారని, వారికి ఈ క్యాంపు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అందుకోసం కార్మికులు తప్పనిసరిగా లేబర్ కార్డు కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశ్, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ రాజేందర్, ఇమ్రాన్, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐ బదిలీ

తాండూరు రూరల్: తాండూరు మండలం కరన్ కోట్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ సత్తయ్యతో పాటు పలువురు కానిస్టేబుళ్లు బదిలీ అయ్యారు. ఏఎస్ఐ మూడేళ్లుగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. బదిలీలో భాగంగా ఏఎస్ఐ సత్తయ్యను చన్గోముల ఠాణాకు ట్రాన్స్‌ఫర్ చేశారు. కానిస్టేబుల్స్ రాజేందర్‌రెడ్డి యాలాల పీఎస్‌కు, సలీంపాష పట్టణ పోలీస్‌స్టేషన్‌కు, రైటర్ అశోక్‌కుమార్ పరిగి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

రూ.18వేలకు పెంచాలి



పోస్టుకార్డులు చూపిస్తున్న వీవోఏలు

అనంతగిరి: ఐకేపీలో పనిచేస్తున్న వీఓల వేతనాలు రూ.18వేలకు పెంచాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సీఎం కేసీఆర్‌కు పోస్టుకార్డులు రాసి పంపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాలీ చాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఏ పని అప్పగించినా.. విజయవంతంగా పూర్తి చేస్తున్నామని, వెంటనే ఉద్యోగ భద్రతతో పాటు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు పుల్లయ్య, సుధాకర్, జంగన్న, శంకర్, లాలన్న, వెంకటయ్య, పుష్ప, లక్ష్మి, సురేఖ, పల్లవి, కవిత, బాలమణి పాల్గొన్నారు.

జేపీఎస్‌ల సమ్మె న్యాయమైనది..

జేపీఎస్‌లు చేపడుతున్న సమ్మె న్యాయమైనదని జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు రాంచందర్ అన్నారు. ఈ మేరకు జేపీఎస్, ఓపీఎస్‌లు తమను పర్మినెంట్ చేయాలని కోరుతూ.. చేస్తున్న నిరవధిక సమ్మెకు ఆయనతో పాటు పలువురు సీనియర్ పంచాయతీ కార్యదర్శులు సంఘీభావం తెలిపారు.

చేతనైన సాయం చేస్తా..

కుల్కచర్ల: గ్రామ ప్రజల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని అల్లాపూర్ సర్పంచ్ శివిబాయి బాలునాయక్ అన్నారు. గురువారం అల్లాపూర్ గ్రామపంచాయతీ అనుబంధ గ్రామం చాకల్‌పల్లి అనుబంధ గ్రామానికి చెందిన మానియ, శాంతిబాయి కూతురు విజయ వివాహానికి రూ.10వేల విలువైన వంట సామగ్రిని కానుకగా పంపిణీ చేసి మాట్లాడారు. ఆడపిల్లల పెళ్లికి చేతనైన సాయం చేస్తానని చెప్పారు.

ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలి

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు: పోలీసులు



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

దౌల్తాబాద్: ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని కొడంగల్ సీఐ శంకర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడిపి చాలా మంది ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారని తెలిపారు. హెల్మెట్ లేకుండా ప్రయాణాలు కొనసాగిస్తే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. అలాగే మద్యం తాగి వాహనం నడపవద్దని, దగ్గర పత్రాలు ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ రమేష్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

అంధత్వ నివారణకు 'కంటివెలుగు'



కొడంగల్ రూరల్: నేత్ర శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ పకీరప్ప

కొడంగల్ రూరల్: అంధత్వ నివారణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పకీరప్ప అన్నారు. గురువారం హస్నాబాద్‌లో సర్పంచ్.. కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. నేత్ర శిబిరంలో చూపు మందగించిన వారికి కంటి పరీక్షలు చేసి, సమస్యను బట్టి ఉచితంగా మందులు, కళ్లద్దాలు ఇస్తారని తెలిపారు. అవసరమైన వారికి శస్త్రచికిత్స చేస్తారని, కావున ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సద్వినియోగం చేసుకోవాలి..

దోమ: కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లింగన్‌పల్లి సర్పంచ్ బల్లరాణి అన్నారు. లింగన్‌పల్లిలో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ నేత్ర శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు. నాయకులు నర్సింహులు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: అంధత్వ నివారణే లక్ష్యంగా ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందని తిమ్మారెడ్డిపల్లి సర్పంచ్ సామ పద్మ అన్నారు. తిమ్మారెడ్డిపల్లిలో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కంటి శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వమే అన్ని పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి శస్త్ర చికిత్స, మందులు పంపిణీ చేసుందని తెలిపారు.

15 నుంచి 31వరకు సీఎం కప్ టోర్నీ

జిల్లా యువజన క్రీడల అధికారి హన్మంత్‌రావు

అనంతగిరి: ఈనెల 15వ తేదీ నుంచి 31వరకు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి హన్మంత్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టోర్నీలో భాగంగా 15 నుంచి 17వరకు మండల స్థాయి, 22–24వరకు జిల్లా స్థాయి, 28 నుంచి 31వరకు రాష్ట్ర స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో 15–36 ఏళ్లలోపు వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. టోర్నీ నిర్వహణకు ప్రభుత్వం మండల స్థాయిలో రూ.15వేలు, జిల్లా స్థాయిలో రూ.75వేల నిధులు కేటాయించిదని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ప్రశంసాపత్రం అందజేస్తామని వెల్లడించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందిన జట్లకు సర్టిఫికెట్లతో పాటు మొదటి బహుమతిగా రూ.1లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.75 వేలు, తృతీయ బహుమతిగా రూ. 50వేలు ఇవ్వనున్నట్లు వివరించారు. వ్యక్తిగత క్రీడల్లో ప్రథమ రూ.20వేలు, ద్వితీయ రూ.15వేలు, తృతీయ రూ.10వేల నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తిగల వారు మండల కేంద్రాల్లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని ప్రకటించారు.

15నుంచి మండల స్థాయి క్రీడలు

పరిగి: ఈనెల 15 నుంచి 17వ తేది వరకు మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శేషగిరిశర్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, 100మీటర్ల, 200 మీటర్ల పరుగుపందెం, లాంగ్‌జంప్ ఉంటాయని తెలిపారు. 15 నుంచి 36 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్నవారు ఈనెల 14వ తేది లోపు మండల పరిషత్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పట్టణ కేంద్రంలోని మినీ స్టేడియంలో టోర్నీ జరపనున్నట్లు వెల్లడించారు.

సెల్‌ఫోన్ రికవరీ



రవికుమార్‌కు మొబైల్ అందజేస్తున్న ఎస్ఐ

మర్పల్లి: దొంగిలించ బడిన సెల్ ఫోన్‌ను సీఈఐఆర్ ద్వారా గుర్తించి బాధితుడికి అందజేశామని మర్పల్లి ఎస్ఐ అరుణ్‌కుమార్ గౌడ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన రవికుమార్ అనే వ్యక్తి ఈ నెల 7న బిల్‌కల్ గ్రామంలో తన మొబైల్ పోగొట్టుకున్నాడు. అదే రోజున పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ ద్వారా ఫోన్‌ను చోరీ చేసిన వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకొని రవికుమార్‌కు అందజేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనంతగిరిగుట్టలో అపరిశుభ్రత

రహదారులకు ఇరువైపులా వ్యర్థాలు



గుట్ట రోడ్డు పక్కనే వ్యర్థ పదార్థాలు

అనంతగిరి: అనంతగిరిగుట్ట చల్లని, ప్రశాంతమైన ప్రదేశానికి పేరు గాంచినది. ఇక్కడ ఇతర ప్రాంతాల కంటే ఉష్ణోగ్రతలు చాలా తక్కువగా ఉండటంతో పర్యాటకులను ఎక్కువగా ఆకర్షిస్తోంది. పచ్చని చెట్లు, సుందరమైన గుట్టలను చూడటానికి పర్యాటకులు వస్తుంటారు. ఇలాంటి ప్రాంతంలో ప్లాస్టిక్, చెత్తచెదారం పేరుకుపోయి డంపింగ్ యార్డును తలపిస్తోంది!. ఇలా గుట్ట ప్రధాన రోడ్డు పక్కనే చెత్త పేరుకుపోయి దర్శనమివ్వడంతో సంబంధిత శాఖ అధికారుల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్టు కనబడుతోందని పలువురు పర్యావరణ ప్రేమికులు, పర్యాటకులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. అనంతగిరి ఆలయానికి వచ్చిన సందర్శకులు స్వామి వారిని దర్శించుకోవడం, అనంతరం అడవిలో విహరిస్తూ ఉత్సాహంగా గడుపుతుంటారు. తమవెంట తెచ్చుకున్న ఆహారపదార్థాలను చెట్ల కింద కూర్చుని భోజనం చేస్తుంటారు. భోజన అనంతరం వ్యర్థ పదార్థాలు అక్కడే వదిలేయడంతో చెత్త పేరుకుపోతుందని, దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడమే కారణమన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంలో అధికారులు స్పందించి, చెత్త బుట్టలు ఏర్పాటు చేసి వ్యర్థాలను అందులో వేసే విధంగా పర్యాటకులకు అవగాహన కల్పించాలని పర్యాటకులు, అటవీ ప్రేమికులు కోరుతున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



యాలాల: కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సర్పంచ్ తదితరులు

యాలాల: దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి, మద్దతు ధర పొందాలని విశ్వనాథ్‌పూర్ సర్పంచ్ సత్యమ్మ అన్నారు. గురువారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఐకేపీ కేంద్రాల్లో గిట్టుబాటు అవుతుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శరణప్ప, గ్రామస్తులు మాధవరెడ్డి, బస్వరాజ్, వెంకట్ తదితరులు ఉన్నారు.

దోమలో..

దోమ: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల జెడ్పీటీసీ నాగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డిలు అన్నారు. బొంపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులకు ఇబ్బంది లేకుండా వారికి అందుబాటులో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, మద్దతు ధర అందిస్తూ వారి అభ్యున్నతికి తోడ్పాటునందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్ గౌడ్, బొంపల్లి సర్పంచ్ సురేష్, ఎంపీటీసీ రాములు, ఉప సర్పంచ్ రఫీ, నాయకులు బుచ్చిరెడ్డి, చంద్రశేఖర్, వెంకటయ్య, అనంతయాదవ్, శ్రీనివాస్, ఏఈఓ దుర్గప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

జీతాల పెంపుభారం జీపీలపైనే

- ప్రత్యేక గ్రాంట్ ఇవ్వని ప్రభుత్వం
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న సర్పంచులు



పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

దౌల్తాబాద్: గ్రామాల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్స్‌కు ప్రతి నెలా రూ.వెయ్యి పెంచుతూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామపంచాయతీ కారోబార్లు, కార్మికుల వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మిక సంఘాలు రాష్ట్ర ప్రభుత్వానికి గత నెలలో వినతిపత్రాలు అందజేశాయి. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే ఈ నెల 5వ తేదీ నుంచి సమ్మె చేపడతామని నోటీసులు ఇచ్చాయి. పంచాయతీ కార్మికుల ఆందోళన నేపథ్యంలో వేతనం పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు పంచాయతీ సిబ్బందికి నెలకు రూ.8,500 వేతనం చెల్లిస్తుండగా.. తాజా ఉత్తర్వుల ప్రకారం ఇకనుంచి రూ.9,500 ఇవ్వనున్నారు. అయితే పెంచిన వేతనాన్ని చెల్లించే బాధ్యత పంచాయతీల పైనే ప్రభుత్వం భారం మోపింది. ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్ ఇవ్వకపోవడంతో సర్పంచులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ ఆదాయం అంతంతమాత్రంగానే ఉండగా.. ఇప్పుడు ఈ భారం మరింత ఇబ్బందికరంగా ఉంటుందని వాపోతున్నారు. పంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్లు, ఎలక్ట్రిషన్, డ్రైవర్లు, పారిశుద్ధ్య కార్మికులు అందరినీ మల్టీపర్పస్ కార్మికులుగానే ప్రభుత్వం గుర్తించింది.

జీపీలకు ప్రతి నెలా...

మండలంలో 33 గ్రామపంచాయతీలుండగా అందులో 118 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారికి ఆర్థిక సంఘం నిధుల నుంచి గతంలో జీతాలకు వినియోగించేవారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం మార్గదర్శకాలను మార్చడంతో వేతనాల కోసం జీపీలు పన్నుల ఆదాయం, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులను వినియోగించేవి. ట్రెజరీ కార్యాలయాల ద్వారా వేతనాలను చెల్లించడానికి చెక్కులు పంపిస్తుండడం.. ఫ్రీజింగ్ కారణంగా చెక్కులు సకాలంలో చెల్లకపోవడంతో వేతనాలు చేతికందడంలో జాప్యం నెలకొంది. పంచాయతీల కార్మికుల వేతనాల భారాన్ని ప్రభుత్వం మోస్తేనే పంచాయతీలకు ఆర్థిక భారం తప్పుతుందని పలువురు సర్పంచ్‌లు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం నిధుల నుంచి వేతనాల చెల్లిస్తే.. ప్రతి నెల సకాలంలో తమ ఖాతాల్లో జీతాలు జమ అవుతాయని పంచాయతీ సిబ్బంది చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ.. పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచడం హర్షించదగినదే అయినా.. ఆ భారం జీపీలపై మోపడంతో సర్పంచులు అసంతృప్తిగా ఉండటం గమనార్హం.